నా చుట్టూ ఉన్న మనుషులు, వారి జీవితాలు, ముఖ్యంగా స్త్రీల జీవితాలు, వారి ధైర్యం, జీవితాన్ని ఎదుర్కొనే విధానం, వారు చూపే సంయమనం, ఓర్పు, అవసరమైనప్పుడు చూపే ప్రేమ, తెగువలే నాకు కథలు రాయడానికి ప్రేరణ. అలా వారి జీవితాలను తరచిచూసే ప్రయాణంలో ఒక భాగం ఈ కథ.

మన్నం సింధుమాధురి

1

# కొ్ట్రవ్వ

సీతు





‘‘రేపు మనూరిలో పెంటె కట్టిన గొర్రెల గుంపుని పంచుతున్నారంట. పంచాయితీ ఉంది. అందరం పెందలకాడ కట్టి దగ్గరికి పోవాలి. నలుగు రన్నదమ్ములూ అన్ని గొర్రెల్ని, గుర్రాల్ని, కోళ్లని, కుక్కల్ని పంచుకుంటా రంట. కొట్రవ్వ మొగుడికి పచ్చవాతం తగ్గిందంట. ఆడి మందని ఆడికి క్యాంపులో వాళ్లు ఇప్పిస్తారంట. ఇవీ సంగతులు బుజ్జమ్మా,’’ అని చెప్పాడు పాలేరు ఎంకోబు.

‘‘ఎందుకు విడిపోతున్నారు. పెద్దమంద కదా?’’ అన్నాను.

‘‘అమ్మనడగండి చెప్పుద్ది,’’ అన్నాడు, సావిట్లో ఎలిచి మీద చిక్కాలు లాగుతా.

మా ఊరికొచ్చే గొర్రెల మందలు, ఆ గొర్రెల వాళ్లంటే నాకు చాలా ఇష్టం. ఇక కొట్రవ్వ గొర్రెలు, మేకల మంద అంటే నేనాడింది ఆట, పాడింది పాట. సంక్రాంతికి పంటలు కొయ్యంగానే కొట్రవ్వ గొర్రెల మంద ఊళ్లోకి వస్తుంది. రావటం కూడా భలే అందంగా... ముందు ఓ పది గుర్రాలు, ఒకదాని వెంట ఒకటి బారులుగా, వాటిపైన వలలని సంచిలా వేలాడదీసి వాటిలో తెల్లగా తోమిన సీవెండి గిన్నెలు, తపేళాలు, కొన్ని బట్టలు, జొన్నలు, సజ్జలు, రాగులు; వెనక గుర్రాల మీద కూతురు, కొడుకు; వాటి వెనకాలే నడుచుకుంటా కొట్రవ్వ. మొగుడు మాత్రం తెల్లటి పంచెకట్టు, మరాఠా టోపీ, నల్లమీసాలు, నల్లటిరంగు తోలుతో గచ్చకాయలు మార్చి కుట్టిన కిర్రుచెప్పులు, చేతిలో అర్ధచంద్రాకారపు ఉక్కుముక్క గొడ్డలి, నుదుటి మీద బండారు (ఒక లాంటి పసుపు సిందూరం)తో హుందాగా నడిచి వస్తంటే, ముందునించి వెనక్కి వెళ్లి ఆవులు, గిత్తలు సరిగ్గా వరసలో వస్తన్నయ్యో లేదో అని చూసే కొట్రవ్వ మరాఠి నాయికలా ఉండేది.

‘‘ఏదో సినిమాలో ఉన్నట్టు ఏడుగజాల ఇలకల్లు నేతచీర, సంకలో తెల్లముక్క మాసిక రవికె, ఎర్రటి తెల్ల అడ్డచారల కొంగుని తలమీదగా కప్పుకున్న మరాఠీ గోచీకట్టు, కాళ్లకి బండ కడియాలు, బొటనవేలుకు పెద్ద మామిడిపిందె చుట్టు, చేతులకి మట్టిగాజులు, ముక్కుకి పెదవిపైదాకా పడే పుడక, చెవులకి రేడియో బ్యాసరలు, చెవి పైన ఒంపులకి బుగిడీ కడ్డీలు, లంగా లేని గోచీకట్టు చీర, సన్నటి నడుం

మీద నిలబడటానికి వెండి కడ్డీ వడ్డాణం, బొడ్డులో దోపుకున్న ఏడెనిమిది పొరల గుడ్డతో కుట్టిన వక్కాకు సంచి... ఆమె నడకకి ఆ సంచి లయబద్ధంగా ఊగేది. వెనక కొన్ని ఆడగుర్రాల మీద కోడిపెట్టలు, పుంజులు, గిన్నెకోళ్లు, పావురాల పంజరాలు, వలలు, గుడారాలు, కర్రలతో పండగలాగా వచ్చేవాళ్లు. చూడ్డానికే ఓ పదిహేను నిమిషాలు పట్టేది.

ముందుగా ఎవరు కోతకోస్తే ఆళ్ల చేలో కొంచెం బాగుచేసుకుని గుడారాలు లేపేవాళ్లు. ఆ డేరాలకి ఉట్లు కట్టి, ఓ జమ్మికర్ర నరికి చల్లగుంజలా పాతి పూజ చేసేది కొట్రవ్వ. దానికి రెండు తాళ్లు కట్టి వాటిలో చల్ల కవ్వం దూర్చి కింద రెండు చుట్టు కుదుళ్లు (కుండ దొర్లకుండా తాటాకు చుట్టలు) పెట్టి, దానిపైన పెరుగు వెన్న కలిపిన తపేళా ఉంచేది. ఆ తపేళాకి బండారు పెట్టి, సాంబ్రాణి ధూపం వేసేది. తరువాత మూడు కొండరాళ్లు పొయ్యిలా ఏర్పాటుచేసి, ఓ గుడ్డని నెయ్యిలో తడిపి, వాటి మధ్యలో ఉంచి, పైన చితుకులు వేసి భర్తని నిప్పు చెయ్యమనేది. అతను బొడ్లో దోపుకున్న చెకుముకి రాళ్ల సంచీ తీసి, ఒక రాయి మధ్యలో పత్తి పెట్టి రెండో రాయితో గట్టిగా కొట్టేవాడు. పత్తి మండగానే పొయ్యిలో వేసి అగ్నిదేవుడికి దణ్ణం పెట్టేది.

క్యాంపులో ఇంటింటికీ తిరిగి తాము వచ్చిన విషయం చెప్పి, తుమ్మచెట్లూ, రిజరు బీళ్లూ, చేలూ, చిగురు పత్తి గొర్రెలు యేయడానికి అడిగేది. ఎక్కువ తుమ్మచెట్లు ఉంటే రెండు మూడు మేకపిల్లల్ని డబ్బుకింద ఇచ్చేదానికి ఒప్పందం కుదిరేది. సాయంత్రం తమ్ముళ్లు ముగ్గురూ, కుక్కలతో గొర్రెలమందను అడవిలో మేపుకుంటా నిదానంగా గుడారాలు ఏసిన చోటకి చేరేవాళ్లు.

పొలం చుట్టూ రిజరు కర్రలు చెక్కి గుంజలు పాతి వాటికి అడ్డం నిలువు గళ్లలా కర్రలతో కట్టి, దానికి చుట్టూ రేగు, డొల్ల తుమ్మ (రాక్షసి/రావాసీ తుమ్మ) కంప కొట్టి, రెండు భాగాలు చేసి ఒకటి పెద్దవాటికీ ఒకటి పిల్లలకీ వదిలేవాళ్లు. రెండింటికీ బరువైన పచ్చికర్రలతో తలుపులా అడ్డం పెట్టేవాళ్లు. అప్పుడు మందని లోనకి తోలేవాళ్లు. తెల్లవార్లూ పెంటికలు వేస్తే అవి ఒక పక్కగా పోగేసేవాళ్లు. పొద్దున్నే జీతగాళ్లు వెళ్లి చేనంతా చిమ్మేవాళ్లు. అది చేనుకి బలమైన ఎరువుగా మారేది.

ఇక నాకు గొర్రెల మంద వస్తే ఎంత ఆనందమో మా అమ్మకి అంత చిరాకు, ఎందుకంటే ఇంటిపట్టున ఉండనని. ఇక ఆ నెలరోజులూ ఎక్కువగా చేలోనే, వాళ్ల గుడారాల్లోనే. నాతోపాటు తమ్ముణ్ని కూడా తీసుకెళ్లేదాన్ని.

పొద్దున్నే ఇంకా చీకట్లు ఉండగానే కొట్రవ్వ మొగుడు ముక్కణ్ణి, అతని తమ్ముళ్లు వచ్చి చంద్రవంక గొడ్డళ్లతో తుమ్మచెట్లని చక్కగా చెలిగేవాళ్లు. చెట్టు చెలగటం ఒక కళ. కొసరు మాత్రం ఉంచి పంగలు ఇరక్కుండా కొమ్మలు కొట్టడం అందరికీ

రాదు. కొమ్మలు చెలిగినాక చెట్టు చూస్తే కొమ్మలు, దాని శాఖలు, ఉపశాఖలు అన్నీ 'వి' ఆకారంలో సజీవ చిత్రంలా కనపడేవి. చిటారు కొమ్మల చిగుళ్లు తోడుపోయిన దిగులుతో గుబులుగా కనపడేవి. చెలిగిన కంప అంతా అక్కడొకటి ఇక్కడొకటీ మా ముప్పాతిక ఎకరం ఇళ్లస్థలమంతా పరిచేవాళ్లు. చెట్లు చెలిగే మోతకి నేనూ తమ్ముడూ లెగిసి గొర్రెలొస్తయ్యి అని ముఖం కడుక్కునేవాళ్లం. సూరీడుకన్నా ముందు గొర్రెల్ని తోలుకుని కొట్రవ్వ వచ్చేది. సంకలో అడ్డగుడ్డలో ఆమె పసికొడుకు ఉండేవాడు. పెద్ద కర్రకి కొంకి కత్తి కట్టి ముళ్ల తుమ్మ కొమ్మల్ని, వాటికున్న కాయల్ని గొర్రెలు అనువుగా మెయ్యటం కోసం తిరగేసేది.

తమ్ముడూ నేనూ చెంబూ గ్లాసులతో గొర్రెల పాలు పిండటానికి తయారు! పాపం ఒక్కో గొర్రె పాలు ఇచ్చేది. కొన్ని దొరక్కుండా పారిపోయేవి. కొన్నిటిని తమ్ముడు వెనక కాళ్లు పట్టుకునేవాడు. వాడికి చేతులు నెప్పి పుడితే వదిలేసేవాడు. ఫట్‌మని తన్నేవి. పాలచెంబూ నేనూ ఎల్లికిలా పడేవాళ్లం. తమ్ముడు కోతిలా కిసికిసీ నవ్వేవాడు.

"ఒరేయ్ సచ్చినోడా, నే పిండిన పాలు నేనే తాగేత్తా, నీకు కొద్దిగా కూడా పొయ్యను," అని ఉక్రోషంగా లెగిసి మళ్ల పరిగెత్తి దాని దగ్గరికి వెళ్లేదాన్ని. ఆది గుర్రుగా పొడవటానికి చూసేది. ఇద్దరం బుల్లి బుల్లి మేకపిల్లల్ని ఎత్తుకునేవాళ్లం. గుర్రం పిల్లలు నున్నగా, ఆటి తోకలు దూదిలా మెత్తగా ఉండేయి.

గొర్రెల పాలు తెచ్చి అమ్మని కాసి ఇమ్మనేవాళ్లం. అమ్మ ఆ వాసనకి ముఖం, ముక్కు చిట్లగిచ్చేది. ఈళ్లు పిల్లలా, బీట్రో దయ్యాలా? గొర్లపాలు తెచ్చి కాయమని సంపుతున్నారనేది. నాన్న తీసుకుని కాసిచ్చేవాడు. తమ్ముడూ, నేనూ పెద్ద పెద్ద గ్లాసుల నిండా తాగేవాళ్లం. మేపటం అయిపోయాక కొట్రవ్వ ఎల్లిపోయేది. ఆళ్ల మరుదులు పచ్చి కంపని మండిలా ఏసేవాళ్లు.

మళ్లీ మజ్జాన్నం కోసం ఎదురుచూసేవాళ్లం. కొట్రవ్వ ఆమె కూతురు లాలి గుండ్రటి గుండిగ గిన్నెలు తీసుకుని ఇంటికి వచ్చేవాళ్లు. మా ఇంటి ముందు తియ్యటి నీళ్ల బోరు జమ్మి చెట్టు కింద ఉంది. దాని ముందు ఈ తపేళాలు కొండెర్ర మట్టితో తెల్లగా తోమి నీళ్లు కొట్టి నింపేది. అటిని ఒకదాని మీద ఒకటి ఉంచి పైన దాని మీద సిబ్బిరేకు మూతేసేది. దారానికి గుచ్చుకొచ్చిన ఎండుకొబ్బరి చిప్పలు తీసి, వెల్లుల్లి ఎండు చెట్ల కట్టనించి పాయలు విడదీసి గబ్బాలు వలిచి, ఎండు మిరపకాయలు, జీలకర్ర, ఉప్పు అన్నీ కలిపి కారం కొట్టేది. కొబ్బరిచిప్పలు, ఉప్పు, వెల్లుల్లి అన్నీ తెలుపే, కానీ కారం మాత్రం మా ఊరి కొండమట్టంత ఎర్రగా కమ్మటి వాసన ఇల్లంతా వచ్చేది. ఆ కారం అంతా ఒక గుడ్డలోకి తీసేది. ఆఖరున కొద్దిగా కుసుమలు, గురెళ్లు (ఒక లాంటి కొండ పొద్దుతిరుగుడు గింజలు)లో గుడ్డలోని కారం కొద్దికొద్దిగా కలిపేది. మూడు రకాల కారాలు కొంచెం కొంచెం ఒక పళ్లెంలో నాన్నకి సారె పందేరంలా

అవర్చేది. అవి నాన్న నెయ్యి కలుపుకుని లొట్టలేత్తా తినేవాడు. దొడ్లో ఉన్న ఎర్ర గోంగూరకాయలు కోసేది. ఆటిని కూడా మూటకట్టి ఒక గుఱ్ఱం మీద ఏసేది, వాటిని పొలం పట్టుకెలతా మమ్మల్ని రమ్మనేది.

'అమ్మా, నేనూ చేలో కెలతా,' అనేదాన్ని.

అమ్మ గుడ్లురిమి చూసేది వద్దని. నాన్న ఎప్పుడూ మా పక్కే. ఎల్లమనేవాడు.

పంపు దగ్గర ఉతికిన గుడ్డలూ, తోమిన అంట్లూ గుఱ్ఱానికి ఎనక కట్టేది. లాలి నన్ను, తమ్ముణ్ణి ఒక గుఱ్ఱం ఎక్కిచ్చేది. తను మాత్రం అయిదు పెద్ద తపేళాలు ఒకదాని మీద ఒకటి నెత్తిన పెట్టుకుని సంకలో అడ్డగుడ్డలో అమ్మకానీ మరి ఎవరన్నాగానీ పిల్లాణి పొడుకోబెట్టీ మెల్లిగా నడిచేవాళ్లం (గుఱ్ఱాలు నడిచేవి). గుఱ్ఱం మీద ఎప్పుడూ మర్ఫీ రేడియో ఉండేది. దాన్ని పెట్టమనేది. మేం తిప్పేవాళ్లం. సుగమ్ సంగీత్ మరాఠీ గాయని 'గంగూబాయ్ హంగల్'ని వినిపిస్తూ, తాను వింటూ వచ్చిన పాటలయితే పాడుతూ చేనువైపు తిరిగేది కొత్రవ్వ. అబ్బ ఎంత మంచి రోజులు! చేను చేరగానే మరుదులో, గొఱ్రెలు కాసే పిల్లలో వచ్చి తపేళాల్ని, మమ్మల్ని, బట్టల్ని అన్నీ దించే వాళ్లు.

పొయ్యి ఎలిగిచ్చి, ఎసరుపెట్టి మా దగ్గరికి వచ్చి కంబళి పరిచేది. దానిమీద కొన్ని చెక్క, వేరు, బొమ్మలేసేది. వాటికి గుడ్డలు కట్టి, పూసల దండలేసి, బొట్టు పెట్టి ఆడుకునేవాళ్లం.

ఈలోపల ఎసరు మరుగుతా ఉండగానే చేటలో కొత్రబియ్యం ఏసుకొచ్చి టపిచ్చి టపిచ్చి పిచ్చి అనే ఒక సంగీత శబ్దంలాగా, చేటలో బియ్యం పైకి ఎగిరి నప్పుడల్లా తను కూడా భుజాలు ఎగరేస్తా, మధ్యమధ్యలో తలమీదనించీ జారిన పైట కప్పుకుంటా చెరిగి ఎసుట్లో సుయ్యిమని జారబోసేది. అవి ఉడుకుతుంటే, గోంగూరకాయలు, ఉప్పు, గొఱ్రెవెన్న, కొద్దిగా శొంఠిపొడి ఏసేది. దాన్ని దించి, ప్లేట్లలో వేసి, ఆవునెయ్యి, కొబ్బరికారం కలిపి ముద్దలు చేసి పెట్టేది. మేం ముగ్గురం పెద్ద పళ్లెం అన్నం ఆవురావురుమని తినేవాళ్లం. ఎందుకో అమ్మ చేసిన నూనెలు పోసిన మసాలా ఫ్రైలు 'వ్యాక్ ఛీ' అనిపిచ్చేది.

పొద్దుకూకేటప్పటికి ఊరంతా తిరిగిన గొఱ్రెలు, ఆవులు, గుఱ్రాలు వచ్చేవి. వాటితో ఆడేలోపల వేడి వేడి రొట్టెలు, బెల్లంపొడి, రోటిపచ్చడి గొఱ్రెపాలతో పెట్టేది.

రాతిరికి ఒక గుడారం బయట కంబళి పరిచి ఎన్నో కథలు... తోడేళ్లు గొఱ్రెల్ని తినటం, ఎలుగుల్ని వాళ్ల తాత వట్టి చేతుల్తో చంపటం, చిరుతల్ని డప్పులతో అదిలి య్యటం, నక్కల్ని నిప్పుమండలతో భయపెట్టటం లాంటివి చెప్పేది. అవి విని వంటి మీద ఎంటికలు నిక్కబొడుచుకునేయి. తమ్ముడు వచ్చి చంకలో దూరేవాడు. పిరికి ఎదవ, ఆడంతే.

ఎర్రని గడ్డమట్టి పొలం, తెల్లని పిండివెన్నెల, నల్లని కంబళి, నీలాకాశం, వజ్రా ల్లాంటి చుక్కలు, చల్లగాలి, కొత్రవ్వ కథలు... అబ్బ ఎప్పుడు నిద్దట్లోకి జారేవాళ్లమో. పొద్దున్నే అమ్మ పంపిన పాలేరు వచ్చేదాక మెలకువ వచ్చేదికాదు.

ఛీ ఇంటికి ఎల్లకుండా ఎప్పుడూ ఈ పొలాల్లో, గొర్రెలతో, కొత్రవ్వతో ఉండొచ్చు కదా అనిపిచ్చేది. ఒకసారి బలవంతంగా తీసుకెలతంటే పాలేరు చెయ్యి కొరికాను. అప్పటినించీ తనకి భయ్యం. నేనొచ్చేదాకా ఆగి తీసుకెలతాడు. ఇక ఆళ్ల గురువులు వచ్చినప్పుడు పండగే పండగ. వాళ్లు బండారు పెట్టుకుని, గొర్రెలు, గొర్రెపిల్లలు, గుర్రాలు రోగాలతో మరణించకుండా మంత్రాలు వేసి రక్షలు కట్టేవాళ్లు. వాళ్లొచ్చి నప్పుడు మాత్రం మందలో మంచి లేత గొర్రెని కోసి వాళ్లకి విందు చేసేవాళ్లు. అప్పుడు అమ్మానాన్నని పిలిచేవాళ్లు. ఇక మేమయితే దాని మాంసం గిన్నెలో ఏసిన దగ్గరనించీ పళ్లెంలోకి పడేదాక ఒకటే ఆటలు. కొత్రవ్వ విడిగా అయితే మేకలు కొయ్యదు. తను పెంచిన మంద తన బిడ్డల్లాంటివని అనుకునేది. ఎప్పుడూ యాట మాంసం బయట కొని తినేది కాదు.

తను తినకపోయినా మా అందరికీ వండి వడ్డించేది. తన మరుదుల్ని, బిడ్డలని, గొర్రెలు కాసే సేవకుల్ని, గుర్రాలని, కుక్కల్నీ ఎంతో ఆప్యాయంగా, ప్రేమగా చూసేది. అట్టాగే చెట్లు చెలిగేటప్పుడు యజమాని దగ్గర లేడని తలలు కొట్టేసి మొండెం మిగిలి చ్చినా ఊరుకునేది కాదు. చెలిగిన చెట్టు చేవదేలి మళ్లీ ఎక్కువ చిగుర్లెయ్యాలనేది. కొమ్మలు కొట్టుకోవాలి, మొదళ్లు కాదు అని తిట్టేది. తుమ్మచెట్ల బంకంతా తీసి మాకిచ్చేది, పుస్తకాలు అంటిచ్చుకోమని. మందలో ఒక గొర్రె తప్పిపోయినా, వెతక టానికి ఎల్లిన మరుదులు రాకపోయినా విలవిలలాడేది. గొర్రెలకి తేలుకుట్టినా, మండ్ర గబ్బలు కరిచినా, మరుదులకి ఈత, తుమ్మముళ్లు నాటినా వాటి పైన గొర్రెవెన్న, ఉప్పు పెట్టి కాల్చేది. పుళ్లకి జిల్లేడు పాలతో వైద్యం చేసేది. గడ్డలయితే తిప్పతీగ ఆకులు ఆముదంలో తడిపి, మట్టి మూకుట్లో ఏంచి గుడ్డ కట్టేది. ఆమె పశువైద్య దేవత కూడా!

అత్తకి కాళ్లొత్తి, కాళ్లు మొక్కి పడుకునేది. అట్టాంటి కొత్రవ్వ గొర్రెల మంద విడిపోవటమా, విడగొట్టుకోవటమా, గొర్రెల్ని గుర్రాలని పంచుకోవటమా, మందని విడగొట్టటమా. ఎదురుతిరిగి ఎవ్వరికీ నొప్పించే సమాధానం కూడా ఇవ్వని వ్యక్తి, నిండా ముళ్లతో నిండిన తుమ్మవనం కూడా కొత్రవ్వని చూస్తే ఆమె గొర్రెలకోసం ముళ్లని ఉంచుకుని, ఆకుల్ని కాయల్ని రాల్చుద్ది. ఆమె పొలాల్లో నడుస్తుంటే ఈమె నన్ను సారిణి చెయ్యటం కోసం వచ్చిన తల్లి అని కాళ్ల కింద మట్టిగడ్డలు కూడా నలుగుతయ్యి. అట్టాంటి మనిషి మందని పంచమనటమా? ఎవ్వరినడిగినా మీ నాన్నా అమ్మే పంచుతున్నారు అనంటున్నారు.

‘‘అమ్మా... మా... నాన్నా... నా...’’

అమ్మని అడగాలి, నేను పరీక్షలకి వెళ్లటం వల్ల ఈ సంవత్సరం జరిగిన విషయాలు తెలియలా. అమ్మ కోసం ఎతికాను.

‘‘అమ్మా... అమ్మా... మా... మా...’’ అంటా అరిచా.

‘‘ఏంటి? ఎందుకా రంకెలు,’’ అంది అమ్మ.

‘‘ఏంటిమా కొట్రవ్వ వాళ్ల మందని పంచుతున్నారంట? నాన్నా నువ్వా ఆటిని వేరు చెయ్యటం పాపం కదా?’’

‘‘కొన్ని పనులు పాపం పెరగకుండా ఉండటం కోసమే. కొందరు మోసే వాళ్లు, కొందరు మోపిచ్చుకునేవాళ్లు. కొట్రవ్వకి మోత తగ్గించి, ఊపిరి పీల్చుకుని, ఉసురు నిలుపుకుంటానికి ఊతం ఇద్దామని.’’

‘‘ఏం జరిగిందిమా? నాకు చెప్పవా. అందరూ మీరే ఎందుకో విడగొడతన్నారని అంటన్నారు.’’

‘‘నీకు ఎంతవరకూ చెప్పొచ్చో. కూతురుగా కన్నా ఒక స్నేహితురాలిగా ఆమె బాధ చెపుతాను. నీకు నీ తల్లిదండ్రుల పైన అనుమానాలు పోయి, వాళ్ల మీద మంచి అభిప్రాయం కన్నా చెడు భావన కలగకుండా ఉంటే చాలు.’’

అమ్మ కొట్రవ్వని పిలిచింది. తను మా కచ్చేరీ సావిట్లోనించి మెల్లగా వచ్చింది. చూశాను.

వచ్చింది తనేనా! ఎంత అందమయిన ఆత్మవిశ్వాసం. ఏమయింది! ఎంత మార్పు! పగిలిన ఎర్రమట్టి నేలలా నెత్తురు లేకుండా, చిన్నప్పుడు ఊరి పొలిమేరలో దిష్టికోసం చెక్కి దిగేసిన ఎండు తుమ్మకట్టి ఎండకి ఎండి, వానకి తడిసినట్లుగా ఉంది.

‘‘ఏ... ఏంటి కొట్రవ్వా?’’ తడబడ్డా. ‘‘ఇట్లా ఎందుకయిపోయా.’’

నన్ను కన్నార్పకుండా ఒక్క నిమిషం పాటు చూసి, అమ్మవైపు తిరిగింది... ‘‘బుజ్జమ్మకి అవసరమా ఇయన్నీ?’’

‘‘అవసరమే! ఇప్పుడు మనం వాళ్ల తల్లులం. ముందుముందు ఆళ్లు మన తల్లులు. తరాల మన సెరకి అర్థం వీళ్లతోనే పంచుకోవాలి. ఎక్కడో మన కష్టం వదులుకోటం కన్నా అయిన వాళ్ల దగ్గర బాధని దించుకోవటంలో తప్పులేదు.’’

చెక్కలా మారిన మొకాన్ని బొమ్మలా కదుల్చుతూ చెపుతుంటే వినటమే నా వంతు.

‘‘కూతురా, నీకు తెలుసుకదా... గొర్రెలు, గుర్రాలు, కోళ్లు, కుక్కలు, తోడేళ్లు, నక్కలు, నిద్దర లేని రాతిర్లు, మందల కాపలా. గొర్రెల బాస తెలిసినట్టుగా మనుసుల బాస రాదు. వాటి బాధలు తెలుసు. ఎప్పుడు ఆటికి ఆకలవుద్ది. దాహమవుద్ది, ఎదకొస్తయ్యి, ఈనతయ్యి, ఆటి కోపాలు, వాటికొచ్చే రోగాలు, వాటికి మందులు

తెలుసు. తోడేలు ఏ రాతిరిలో ఆకలితో మందమీద పడుద్దో తెలుసు. అది ఆకలి కోసం ఒక పిల్లనే తింటది. కానీ, అంతం లేని ఆకలికి నేను ఇస్తరిలా మారిపోయా.

"మా నాయన 18 ఏళ్లకి పక్క మంద వాళ్లు చూడ్డానికి వస్తారని చెప్పాడు. గుడారం శుభ్రంగా ఊడ్చి కళ్లాపి చల్లి కంబళ్లు పరిచి మేకని కోసి వండి ఉంచాను. తల్లి లేని నాకు బాబాయ్ పెళ్లాం అండగా నిలిచింది. ఆళ్లది మరాఠీ దేశం. పోయిన వానాకాలంలో చెప్పి పంపితే, సంకురాతిరి నాటికి ఎలాగయినా నా పెళ్లి ఖాయం చెయ్యాలని వచ్చింది.

"నా మొగుడు, మా అత్త నన్ను చూట్టానికి మరుదులతో వచ్చారు. మా అత్త నా చేతులు, కాళ్ల పిక్క కండలు వత్తి వత్తి చూసింది. 'మగడు, మరుదులు, మమ్మ ల్నందరినీ తట్టుకుని కట్టం చెయ్యాలి,' అంది. ఆ మాటలు ఆరోజు అర్థంకాలా.

"నన్ను పరిచ్చలు చేసినాక 10 గుఱ్ఱాలు, 100 మేకలు, 200 గొఱ్ఱెలు, తులం కంటె, కదుగు (ఒక మెడ నగ), కాళ్లకి ఎండి కడాలతో నా పెళ్లికి బయలుదేరాం. అదిగో అప్పుడు మొదలుకుని అరిగిన బండి ఇరుసులాగా తిరుగుతా ఉండా.

"పెళ్లి తరవాత కొత్త గుడారం, కొత్త గొఱ్ఱెల మంద, కొత్త పేర్లు... పెళ్లికాక ముందు పనిలేదు... ఈడ పొగులంతా పని, రాత్తిరి కక్కులొచ్చినట్టు కోరికలు పార బోసే మొగుడు... అంతలోనే కడుపున పడి కాసిన రొండు కాయలు... నాతోబాటు ఆళ్లదీ మూగబాద... ఎత్తుకుని పాలు తాగిచ్చే ఈలు కూడా లేని శాకిరి... శాకిరి.

"పచ్చగా ఉండే మొక్కని ఏరుపురుగు గొట్టి నిలువుగా ఎండినట్టు, నా మొగుడికి పచ్చవాతం ఒచ్చి మంచానికి అతుక్కుపోయాడు. కాలూచెయ్యీ సరిగ్గా ఆడక కొద్దికొద్దిగా కదిలిత్తా మంచంలో పడి ఉండే మొగుడు... ఇద్దరు బిడ్డలతోపాటు మూడో బిడ్డ అయ్యే.

"మా అయ్య తీసుకుపోతానని... మావాళ్లు ఒప్పుకుంటే గదా... 'మాకేం తక్కువ... మందకీ... ఇక్కడున్నా... అక్కడున్నా చాకిరీనే గదా... అయినా మా అన్నకి మేం మందులు కొనగలం,' అనె. నాయన దిగులుతో ఎనక్కి తిరిగాడు... ఇక నా పని...

"అడివి పావురాళ్ల రక్తం ఒళ్లంతా రాయటం... నూగుల నూనితో రుద్దటం... వేడి చేసేవాటిని ఒండిపెట్టటం... ఈ మందని కాయటం.

"ఈళ్ల మందకేం తక్కువ. చాకిరి చేస్తే ఆడది కూడా సొత్తే. ఒకే పోతు మొత్తం మందకిలాగా.

"పొగులంతా గొఱ్ఱెలు... మొగుడి శాకిరి. చేను చేను... పొలం పొలం తిప్పి మందలు ఇవ్వటం... పొద్దుకూకితే కూడూ కుమ్మూ ఉడకేసి..." ఆగింది... నా వంక ఒక చూపు చూసి-

"ఇయ్యేకాదు... రాత్తిరికి తోడేళ్ల కత.

"ఇయ్యి బైట తోడేళ్లు కాదు.

"ఒకళ్ల తరువాత ఒకళ్లు.

"చూసినా ఎరగనట్టు ఉండే అత్త.

"ఏ పనీ చెయ్యకుండా నీరసంతో పడుండే మొగుడు.

"తరవాత పుట్టినాళ్లు ఎవలకి పుట్టారని గొఱ్ఱె, గొఱ్ఱె అడుగుతా ఉండట్టుగా. ముందెల్లే గొఱ్ఱెల్ని మిగిలినయ్యి గుడ్డిగా ఎనకపోయినట్టు... ఊరూరా... పొలం పొలంలో, చేలల్లో... గుఱ్ఱాలు, గొఱ్ఱెల్లో ఒక మూగజీవంలాగా నేను... మజ్జ మజ్జలో మొగుడి జబ్బుకి వైద్యం..."

"పారిపోవాలని ఎపుడూ అనిపిచ్చలేదా కొట్రవ్వా?" అన్నా.

"చాలా తడవలు... ఎక్కడికిపోను? ముంగాళ్లు ఇద్దరు... మళ్లీ ఇద్దరు... మొత్తం నలుగురు. మరి బాగుండన్నాళ్లూ మొగుడితో ఉండి ఆడి కష్టం తిని... ఇవ్వాళ కాలూ చెయ్యీ బాగోలేదని ఈ ఐదో పిల్లాడ్ని, పశోడిని ఒదిలేసి ఎక్కడికి పొయ్యేది? ఎట్టా పెంచను? ఎక్కడికెల్లి తలదాసుకున్నా వదిలే రకాలా? చిన్న ప్యాణం నీది... నా కష్టం ఇనే రోత ఏ పగోళ్లకీ ఒద్దమ్మా? ఆఖరికి నాకన్నా పదేళ్ల తరవాత పుట్టిన నా చిన్న మరిదికి కూడా నా ఒళ్లు..." మాట్టాట్టం ఆపేసి, చూపులు మా ఊరి కొండమీద నిలబెట్టింది.

అమ్మ గబగబా నీళ్లగ్లాసు అందిచ్చింది.

"ఒకరోజు మితిమీరిన ఆళ్ల కామానికి ఒకళ్ల తరువాత ఒకళ్లు మీద పడితే నా ఏడుపుకి గాలి మూగదయ్యింది... మంచం పక్కనే అనుభవిస్తున్న చిన్న మరిది, 'నీ మొగుడు లెగిసొత్తాడా? రానియ్యి? ఆడు లెగిసేది లేదు, నీతో సంసారం చేసేది లేదు!' అని అంటంటే... ఆ రోతని... సీదరని చూసిన మొగుడులో కొద్దిగా చలనం... కళ్లలో వాళ్ల మీద చూపిచ్చిన ఆశహ్యం. యాడాదిగా తీసుకున్న మందుల ఫలితమో... మూగజీవాలకి తిండిపెట్టి నీళ్లు తాగిచ్చిన ఫలితమో... ఏ చెట్టూ తలా మొదలూ కొట్టని మంచో... మంచం పక్కనే ఆనిచ్చి ఉండే కొంకి కఱ్ఱని పట్టుకోమనీ, దానిని నా చేతికి ఇవ్వు అన్నట్టుగా ఉన్నై ఆ చూపులు. పొట్ట బిగిచ్చి దవడ ఎముకలు ఉబ్బిచ్చి ఆ కత్తి వంకా... నా వంకా మార్చి మార్చి చూసాడు. ఇసిగి అలిసిపోయిన నా కళ్లు కొంకి కఱ్ఱని చూసినయ్యి. రోసంగా మారిన నిస్సత్తువ... పళ్ల బిగువుగా ఊపిరి బిగదీసి కొంకి కఱ్ఱని అందుకున్నా... పొడుగాటి కొంకి కఱ్ఱ, దానికి బిగదీసి నారతో కట్టిన చంద్రవంక కత్తి... ఎన్నో చెట్లు, ఎఱ్ఱ తలలు ఏసిన కొమ్మలు చెలగటం తెలుసు... అంతే కత్తి అందుకుని ముందు నామీద పడ్డవాడినీ... తరవాత పడాలని చూసిన పశువులనీ బాదిన... కాదుకాదు చంద్రవంక కత్తితో గాట్లు... బాదుతా ఉంటే చేలో

అద్దురాయిలాగా చూస్తా ఆనందపడే మొగుడు... పారిపోయి భయంభయంగా చేలలో దాక్కున్న మరుదులు... కాంఢ్రిచ్చి ఊపిచ్చుకున్న తల్లి...

"కూలబడి ఒక చెయ్యి మంచం కోడు మీద ఒక చెయ్యి మొగుడు మీదా ఏసి... బిడ్డలతో కూకున్నా.

"ఈ ఎముకల చేతులు న్యాయం కోసం అమ్మానాన్నల తలుపు కొట్టినై."

వాళ్లని చూసి కారే కన్నీళ్లని కూడా తుడుచుకోకుండా బాధపడతన్న అమ్మ... ఇదిగో ఇపుడు మందని ఇడగొట్టే పంచాయితీ... గొఱ్ఱెలు, గుఱ్ఱాలు, ఏమీవద్దు కూలి చేసుకుని బతుకుతాను, బిడ్డల్ని బతికిచ్చుకుంటాను అన్న శిథిల గుడారపు మనసూ... మనిషి.

రొండు రోజుల తరవాత 500 గొఱ్ఱెలు, గుఱ్ఱాలు, నాలుగు కుక్కలతో భోజనం తరువాత కొత్త బట్టలు పెట్టి సాగనంపుతా అమ్మ కార్చిన కన్నీళ్లు మరవలేను.

కానీ పంచాయితీ ఒక తీర్మానం చేసింది. అదేంటి అంటే చుట్టుపక్కల పదిహేను ఊళ్లలో కొట్రవ్వ మంద తప్ప వేరే మందలు మేపటానికి లేదనీ... యేరేవాళ్లకి చెట్లూ పొలాలూ మేతకి ఇవ్వొద్దనీ.

నాకు మాత్రం కొట్రవ్వ బాధకి సమాధానం ఏంటో... ఎలా చెప్పాలో అర్థంకాక ఇప్పడికీ తలిత్తే మనసు సముద్రమే అవ్వుద్ది.

ఒకప్పుడు మొత్తం మందని పెంచటం కోసం, ఇప్పుడు బిడ్డలూ మొగుడూ అనే మనుషుల వారసత్వపు మంద కోసం ఆమె బతుకు.

అవును ఆడదాని బతుకు మంద కోసమే.

*తెలుగు వెలుగు మాసపత్రిక*
*మార్చి 2019*

❋



25 డిసెంబర్ 1973న గుంటూరు జిల్లాలో పుట్టిన **మన్నం సింధు మాధురి** పెరిగింది మాత్రం కర్ణాటకలోని ఉళైనూరు క్యాంపులో. వీరి మొదటి కథ ***తుంగభద్రని ముంచెత్తిన వాన*** సాక్షి దినపత్రికలో 2009లో అచ్చయింది. 30 కథలు రాశారు. ఆంధ్రజ్యోతి ఆదివారంలో 20 వారాల పాటు ఉళైనూరు క్యాంపు కథలు ధారావాహికంగా వచ్చాయి. 'కలాపి నేచురల్స్' పేరుతో సబ్బుల తయారీ పరిశ్రమ నిర్వహిస్తున్నారు.

***చిరునామా: బి-6, సాయిసునంద అపార్ట్‌మెంట్స్, 2వ లైన్, పట్టాభిపురం, గుంటూరు - 522 006.***
***ఫోన్: 87909 06686 sindumaduri29@gmail.com***